సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా 14 వేలు, సరాసరిన 18,500 ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.12 ధర పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

గురువారం సాయంత్రం	శుక్రవారం ఉదయం
ఇఫ్తార్ : 6.35	సెహరీ : 4.58



న్యూస్‌రీల్

బాబోయ్ ఎండ

- జిల్లాలో 42.1 డిగ్రీల మార్క్ దాటిన గరిష్ట ఉష్ణోగ్రత
- రాగల మూడు రోజులు వడగాలులు



పుట్టపర్తి టౌన్: భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం 10 గంటల నుంచే ప్రతాపం చూపుతున్నాడు. ఫలితంగా వారం రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. బుధవారం చెన్నేకొత్తపల్లిలో ఏకంగా 42.1 డిగ్రీల గరిష్ట నమోదైంది. ఇక ధర్మవరం 41.6 డిగ్రీలు, తలుపుల, కదిరి, ఎన్‌పీకుంటలో 41.5 డిగ్రీలు నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 41 నుంచి 39 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వడగాలులు వీచాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి, శింగనమలలో 43.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మండుతున్న ఎండలతో జనం ఇంట్లోంచి కాలు బయటపెట్టాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో పుట్టపర్తి, హిందూపురం, కదిరి, పెనుకొండ తదితర ప్రధాన పట్టణాల్లోని ప్రధాన వీధులన్నీ మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాగల మూడు రోజులూ జిల్లాలో వడగాల్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ బి.సహదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతా

- శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద



రోగులతో మాట్లాడుతున్న పరిపూర్ణానంద

హిందూపురం టౌన్: ''బీజేపీ టికెట్ ఇస్తే ఆ పార్టీ సింబల్‌తో పోటీలో నిలుస్తా.. లేదంటే స్వతంత్ర అభ్యర్థిగానైనా హిందూపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తా' అని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. వార్డులు, డయాలసిస్ కేంద్రం, సీటీ స్కాన్, ఎక్సరే విభాగాలను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ... హిందూపురం అభివృద్ధికి 'సప్తపది' అనే నినాదంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. మొదటి అడుగుగా గణేష్ సరోవరం, రెండో అడుగుగా హిందూపురం ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు కూడా రూ.500 నోటుకు ఆశపడకుండా ఐదేళ్ల అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. దేశంలో హిందూపురాన్ని రోల్ మోడల్‌గా చేయాలన్నదే తన సంకల్పం అన్నారు.

రూ.7.64 లక్షలు పట్టివేత

హిందూపురం అర్బన్: ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం పట్టణంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో అనధికారికంగా తరలిస్తున్న రూ.7.64 లక్షలు పట్టుపడింది. ఎలాంటి అనుమతి పత్రాలు, రికార్డులు లేకుండా నింకంపల్లి వద్ద తరలిస్తున్న రూ.2.44 లక్షలు, మోడల్ కాలనీ వద్ద రూ.5.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే ఇందుకు సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.



ఈ చిత్రంలో బెంచిపై పడుకున్న వృద్ధుని పేరు చెన్నారెడ్డి. పక్కన ఉన్నది ఆయన భార్య. ధర్మవరం మొదటి వార్డులో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛనే వీరికి జీవనాధారం. వయస్సు మీద పడటంతో చెన్నారెడ్డి మనిషి సాయం లేకుండా అడుగు వేయలేని పరిస్థితి. ఐదేళ్లుగా వలంటీరే ఇంటి వద్దకే వచ్చి 1వ తేదీ తెల్లవారుజామునే పింఛన్ ఇచ్చేవాడు. దీంతో దంపతులిద్దరూ హాయిగా జీవనం సాగించేవారు. కానీ ఏప్రిల్ నెల పింఛన్ 3వ తేదీ వరకూ అందలేదు. దీంతో చెన్నారెడ్డి వలంటీర్‌కు ఫోన్ చేసి విషయం కనుక్కోగా..తాను విధుల్లో లేనని, సచివాలయం వద్దకే వెళ్లి తెచ్చుకోవాలని సూచించాడు. దీంతో చెన్నారెడ్డి భార్య సాయంతో ఉదయం 6 గంటలకే ఆటోలో వార్డు సచివాలయం వద్దకు వచ్చాడు. గంటల తరబడి వేచి చూసినా ఫలితం లేకపోయింది. దీంతో ఉసూరుమంటూ వెనక్కు వెళ్లాడు. చంద్రబాబు పుణ్యాన మండుటెండలో పడిగాపులు కాయాల్సి వచ్చిందని చెన్నారెడ్డి దంపతులు తీవ్ర ఆవేదనతో తెలిపారు. బుద్ధి ఉన్నవాళ్లెవరూ చంద్రబాబు లాంటి నాయకులను ఎన్నుకోరన్నారు.



ఇతని పేరు సన్నీరప్ప. వయస్సు 75 ఏళ్లు. అగళి మండలం కరిదాసనపల్లి. అనారోగ్యం, వయస్సు మీద పడటంతో మంచానికే పరిమితమయ్యాడు. ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయడంతో వలంటీర్ 1వ తేదీ ఉదయమే వచ్చి పింఛన్ మొత్తం అందించేవాడు. ఆ డబ్బుతోనే సన్నీరప్ప తనకు కావాల్సిన మందులు తెప్పించుకునే వాడు. కానీ ఇప్పుడు సచివాలయం వద్దకే వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలని ఇరుగూపొరుగు చెప్పడంతో సన్నీరప్ప కన్నీరుమున్నీరవుతున్నాడు. తనను అంతదూరం తీసుకువెళ్లి పింఛన్ ఇప్పించేవారు ఎవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తమలాంటి వారికోసమే వైఎస్ జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకువస్తే వారిని పక్కనపెట్టడం అన్యాయమంటున్నాడు. తనలాంటి వారిని చూసైనా ఆ కఠినాత్ముడికి (చంద్రబాబు) మనసు కరగకుండా పోయిందా.. తన స్వార్థం కోసం మమ్మల్ని ఇంతలా కష్టపెట్టాలా అంటూ సన్నీరప్ప శాపనార్థాలు పెట్టాడు. అందరికీ మంచి చేయాలన్న మనసున్న జగన్‌ను మళ్లీ గెలిపించాలని తన వద్దకు వచ్చిన వారందరికీ చెబుతున్నాడు.

మా ఉసురు తగులుతుంది బాబూ

ఏదీ 'పింఛన్'

- పింఛన్ అందక విలవిల్లాడిన పండుటాకులు
- మండుటెండలో కిలోమీటర్ల దూరం తప్పని నడక
- సచివాలయాలకు వచ్చినా నగదు అందక ఇక్కట్లు
- వలంటీర్ల సేవలు తలచుకుంటున్న వైనం
- జగన్ పాలన ఓర్వలేకే చంద్రబాబు కుట్ర చేశారని ఆగ్రహం
- టీడీపీ విధానాలపై మండిపాటు



తాడిమర్రి సచివాలయం-1 వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



లేపాక్షిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

భానుడు భగభగ మండుతున్నా... కడుపునింపే నాలుగు రూకలకోసం పండుటాకులు రోడ్డెక్కారు. పక్కవారి సాయంతో ఒకరు.. నడలేక ఆటోలో మరొకరు.. కాళ్లీడ్చుకుంటూ ఇంకొకరు.. బుధవారం జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా ఇవే దృశ్యాలే కనిపించాయి. వారిని కాస్త కదిలిస్తే కష్టాలెన్నో కన్నీటివరదలా పారాయి. చంద్రబాబు కుట్ర రాజకీయంతో ఎన్నికల కమిషన్ ద్వారా వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో ఏప్రిల్ నెల పింఛన్ పంపిణీ ప్రహసనంగా మారింది. ఇంటింటికీ తిరిగి పింఛన్ పంచే వలంటీర్ మూడురోజులైనా జాడలేక వృద్ధులంతా ఆందోళన చెందారు. చంద్రబాబు రాజకీయ కుట్ర తెలిసి దుమ్మెత్తిపోశారు. వచ్చే ఎన్నికల్లో బాబు మట్టికొట్టుకు పోతాడని శాపనార్థాలు పెట్టారు.

సాక్షి, పుట్టపర్తి/ నెట్‌వర్క్: ఏ ఆసరాలేని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివిధ జబ్బులతో బాధపడుతున్న వారికి వైఎస్ జగన్ సర్కార్ 'వైఎస్సార్ పింఛన్ కానుక'తో ఆదుకుంటోంది. ఐదేళ్లుగా 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ మొత్తం అందిస్తుండగా లబ్ధిదారులు సంతోషపడేవారు. కానీ చంద్రబాబు తన అనుయాయుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదు చేయించారు. పింఛన్ పంపిణీ విధుల నుంచి వలంటీర్లను తప్పించారు. దీంతో మూడు రోజులుగా పింఛన్ అందక వృద్ధులు, దివ్యాంగులు, వివిధ జబ్బుల బారిన పడిన వారు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

సచివాలయం వద్ద పడిగాపులు..

ఏప్రిల్ నెల పింఛన్ మొత్తం సచివాలయాల వద్ద 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తారని తెలుసుకున్న పింఛన్‌దారులు బుధవారం ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకూ పడిగాపులు కాశారు. అయినా కొందరికి పింఛన్ మొత్తం చేతికి అందకపోవడంతో నిట్టూరుస్తూ వెళ్లారు. ఐదేళ్లకాలంలో ఎన్నడూ పింఛన్ కోసం ఇబ్బంది పడలేదని, చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన శని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేసిన వలంటీర్లను చిన్నచూపు చూసే చంద్రబాబు ఇంతకు ఇంత అనుభవిస్తాడని శాపనార్థాలు పెట్టారు.

తూతూ మంత్రంగా పంపిణీ..

ప్రతి నెలా వలంటీర్లే ఇంటింటికీ తిరిగి 1వ తేదీనే 80 శాతం మందికి పింఛన్ మొత్తం అందించేవారు. కానీ పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి వారిని పక్కన పెట్టడంతో బుధవారం పింఛన్ పంపిణీ అంత వేగంగా సాగలేదు. జిల్లాలో 2,72,767 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, తొలిరోజు 10 శాతం మందికి కూడా అందలేదు.

రానుపోను రూ.100 ఖర్చు



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నడవలేని పరిస్థితిలో ఉన్నా. బుధవారం ఉదయమే ఇంటి నుంచి ఆటో మాట్లాడుకుని సచివాలయం వద్దకు వచ్చాను. కానీ ఇక్కడ పింఛన్ ఇవ్వలేదు. ఆటో బాడుగకు రూ.100 ఖర్చయ్యింది. చంద్రబాబు కుట్రలతో నాలాంటి ఎందరో ఇబ్బందులు పడుతున్నారు.

– నారాయణస్వామి, బుక్కపట్నం

నేనెట్టా బతకాలయ్యా



నాకు పక్షవాతం వచ్చింది. చూసేందుకు ఎవరూ లేరు. సీఎం వైఎస్ జగన్ పుణ్యాన వలంటీరే ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. రేషన్ సరుకులు కూడా ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. మూడు రోజుల నుంచి ఇంటి వద్దే పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా. వలంటీర్లు లేకపోతే నా లాంటి వాళ్ల పరిస్థితి ఏమిటి..? ఆ భగవంతుడు చంద్రబాబును శిక్షించాలి.

– లక్ష్మమ్మ, గువ్వలగుట్టపల్లి, పుట్టపర్తి మండలం

మా శాపం తగులుతుంది



నేను వితంతువును. నాలాంటి ఎందరికో సీఎం జగన్ పింఛన్ అందించి ఆదుకుంటున్నారు. దాన్ని కూడా అందకుండా చేసిన చంద్రబాబుకు మా శాపం కచ్చితంగా తగులుతుంది. మట్టికొట్టుకు పోతాడు. ఆ బ్రహ్మ దేవుడు దిగి వచ్చినా చంద్రబాబు గెలవలేడు. – అంజినమ్మ, అడపాల వీధి, కదిరి

బాబొస్తే పథకాలన్నీ ఆగిపోతాయి



చంద్రబాబు వస్తే వర్షాలే కాదు.. సంక్షేమ పథకాలు, పెన్షన్‌లు కూడా ఆగిపోతాయి. రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు. లక్షలాది మంది వృద్ధులంతా ఏకమై ఒక్క ఓటు వేయకుండా ఓడించాలి. అప్పుడే ఆయనకు బుద్ధి వస్తుంది.

– శ్రీరాంరెడ్డి, బాలంపల్లి, హిందూపురం మండలం

పోలింగ్ విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

- ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులంతా శిక్షణకు హాజరు కావాలి
- పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు



ధర్మవరం: శిక్షణ తరగతులకు హాజరైన పీఓలు, ఏపీఓలు, ఇతర అధికారులు



పుట్టపర్తిలో ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ధర్మవరం అర్బన్/పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధులకు ఎంపిక చేసిన అధికారులంతా తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలని, అలాగే పోలింగ్ రోజున తమ బాధ్యతలు నిర్వర్తించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ఎవరైనా పోలింగ్ విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ధర్మవరం ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన పీఓలు, ఏపీఓలకు, పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో హిందూపురం పార్లమెంట్, పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో దాదాపు 12 వేల మంది సిబ్బంది ఉంటారన్నారు. ప్రతి అధికారీ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా రూట్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లకు తెలియజేయాలన్నారు. పీఓ డైరీ రాయాలని, ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే వారంతా పోలింగ్‌కు ఏడు రోజుల ముందు ఫారం –12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టవలసిన పనులు, ఈవీఎంల పనితీరుపై క్షుణ్ణంగా వివరించారు. పోలింగ్ రోజున తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మరోసారి అందరికీ శిక్షణ ఉంటుందన్నారు.

మాక్‌పోలింగ్ తప్పనిసరి..

పోలింగ్ రోజు ముందుగానే పీఓలు, ఏపీఓలు మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంల పనితీరును సరిచూసుకోవాలన్నారు. మాక్ పోల్ సమయంలో ఇద్దరు అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే ఓటింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీల్ వేయాలన్నారు. శిక్షణకు ప్రతి ఒక్క అధికారీ హాజరు కావాలన్నారు. ఎన్నికల విధులకు ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. విధులకు గైర్హాజరైనా, అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఛాలెంజ్, టెండర్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఎవరూ సెల్‌ఫోన్లు వాడకూడదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. శిక్షణ తరగతుల్లో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ధర్మవరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, ఎన్నికల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కుట్రలకు కేరాఫ్ చంద్రబాబు

- పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దారుణం
- వృద్ధుల ఉసురు చంద్రబాబుకు తగలడం ఖాయం
- ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అభ్యర్థి ఈరలక్కప్ప



విలేకరులతో మాట్లాడుతున్న శాంతమ్మ, ఈరలక్కప్ప

మడకశిర: పింఛన్ల పంపిణీని అడ్డుకుని వెన్నుపోటు రాజకీయాలకు, కుట్రలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్‌గా మారారని వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. రాజకీయ కుట్రలో భాగంగానే చంద్రబాబు తన మనుషులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారన్నారు. వృద్ధుల ఉసురు ఆయనకు తగలడం ఖాయమన్నారు. బుధవారం వారు మడకశిరలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుట్రవల్లే నేడు వృద్ధులు, దివ్యాంగులు పింఛన్లు తీసుకునేందుకు నానా కష్టాలు పడాల్సి వచ్చిందన్నారు. టీడీపీ హయాంలోనూ రూ.200 పింఛన్ కోసం వృద్ధులు పడిన బాధలు మనమంతా చూశామని, ఇప్పుడు మళ్లీ అవే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలంటీర్ల వ్యవస్థ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వివిధ జబ్బులతో బాధపడుతున్న వారు 1వ తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దే పింఛన్ అందుకునే వారని, దీన్ని సహించలేని చంద్రబాబు ఎన్నికల కమిషన్ ద్వారా ఇంటింటి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారన్నారు. పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పకుండా మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆ వెంటనే వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తారన్నారు. నీచ రాజకీయాలు చేస్తున్న చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు రవిశేఖర్‌రెడ్డి, జీబీ శివకుమార్, రంగేగౌడ్, వాగేష్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, జెడ్పీటీసీ భూతరాజు, అగళి జేసీఎస్ కన్వీనర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం పట్టణంలోని 32వ వార్డు ఇన్‌చార్జ్ చిల్లా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 305 కుటుంబాలు



పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తచెరువుకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు

చేరికల వెల్లువ

చంద్రబాబు కుట్ర రాజకీయాలు... కూటమి పేరుతో చేస్తున్న డ్రామాలు నచ్చక ఆ పార్టీ నేతలు వైఎస్సార్ సీపీలో వెల్లువలా వచ్చి చేరుతున్నారు. వైఎస్ జగన్ పాలనకు జై కొడుతూ మరోసారి ఆయన్ను సీఎం చేసుకునేందుకు తమవంతుగా కృషి చేస్తామని చెబుతున్నారు. బుధవారం ధర్మవరం, పుట్టపర్తిలోని టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు.

క్లుప్తంగా

మహాసమాధి, లేపాక్షిని దర్శించిన బీఎస్ఎఫ్ ఐజీ



నంది విగ్రహం వద్ద ఐజీ కైలాస్ చంద్ర జాట్, స్థానిక అధికారులు

ప్రశాంతి నిలయం/లేపాక్షి: సత్యసాయి మహాసమాధిని బీఎస్ఎఫ్ ఐజీ ఎస్.హెచ్.కైలాష్ చంద్ర జాట్ సందర్శించారు. బుధవారం బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌తో ఆయన పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శాంతి భవన్ అతిథి గృహం వద్ద ఆయనకు ఎస్పీ మాధవరెడ్డి, సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం సాయికుల్వంత్ సభామందిరానికి చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అలాగే సాయంత్రం లేపాక్షిలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు హిందూపురం రూరల్ సీఐ ఈరన్నతో పాటు లేపాక్షి ఎస్ఐ గోపి స్వాగతం పలికారు. ఆలయంలోని వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు వివరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పోలీస్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



సన్మానం అందుకున్న సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులను బుధవారం తన కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. సన్మానం అందుకున్న వారిలో ఎస్‌బీ ఎస్ఐ కుళ్లాయిస్వామి, ఏఆర్ ఎస్ఐ ఇస్మాయిల్, ఆర్ఎస్ఐలు సుబ్బారెడ్డి, కృష్ణకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు ఎస్పీ కార్యాలయ ఏఓ సుజాత, ఆర్ఐ రవికుమార్, వలి, సూపరింటెండెంట్ సరస్వతి, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా



సైబర్ క్రైమ్ వివరాలు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎన్నికలు తరుణంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ క్రైమ్ కార్యాలయ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ట్రోలింగ్, ఆన్‌లైన్ వేధింపులు, తప్పుడు వార్తల ప్రచారాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. వ్యాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారాన్ని కానీ, మారి ్ఫంగ్ చేసిన ఫొటోలు, వీడియోలను పార్వర్డ్ చేస్తున్న వారిని గుర్తించాలన్నారు. అనంతరం ఇప్పటి వరకూ నమోదైన ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, సీఐ హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కరియమ్మ దేవి జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఆలయానికి బయలుదేరిన భక్తులు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ

అమరాపురం: మండలంలోని కె.శివరంలో కరియమ్మదేవి జ్యోతుల ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయమే మూలవిరాట్‌కు అర్చకులు పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పిండితో చేసిన జ్యోతులను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులు కర్ణాటక ప్రాంతానికి చెందిన కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పూజల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, నాయకులు చిత్తప్ప యాదవ్, రంజిత్‌కుమార్, శివన్న, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు పాల్గొన్నారు.

ఓటెత్తు.. తలరాత మారేట్టు!



ఓటరు అవగాహన ర్యాలీను ప్రారంభిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: ప్రజాస్వామ్యం ఓటు అనే వజ్రాయుధాన్ని పౌరులకు అందించిందని, దాన్ని సద్వినియోగం చేసుకుని మంచి నాయకులను ఎన్నుకుని భవితకు బంగారు బాటలు వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా బుధవారం 'స్వీప్' ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, మెయిన్ బజార్ మీదుగా సాగి తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. నూతన ఓటరుగా నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలాకు లోనుకాకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఈవీఎం, ఓటు వేసే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సెరికల్చర్ ఏడీ సురేష్, ఎంఈఓ గంగప్ప, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సవితకు సహకరించం

- పెనుకొండ టీడీపీలో భగ్గుమన్న విభేదాలు



వాదులాడుతున్న టీడీపీ శ్రేణులు

సోమందేపల్లి: పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితతో కలిసి సాగలేమని బీకే పార్థసారథి వర్గం తేల్చి చెప్పింది. బుధవారం స్థానిక చౌడేశ్వరి కల్యాణ మంటపంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. ఈ క్రమంలోనే దాదాపు అన్ని పంచాయతీల్లోని బీకే వర్గం నేతలు సవిత చర్యలను తప్పుపట్టారు. తమకు సముచిత స్థానం ఇవ్వడం లేదని, తాము ఆమెకు సహకరించేది లేదని కొందరు టీడీపీ నాయకులు తేల్చి చెప్పారు. వారిపై సవిత వర్గం నేతలు దూషణలకు దిగారు. వాదోపవాదాల మధ్యే రాత్రి 9 గంటల సమయంలో సమీక్ష అర్ధంతరంగా ముగియగా, కల్యాణ మంటపం బయట కూడా బీకే పార్థసారథి, సవిత వర్గీయులు తీవ్రస్థాయిలో దూషించుకున్నారు. ఒకదశలో పరస్పర దాడులకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు కల్యాణ మంటపం వద్దకు చేరుకోగా, సవిత తన వర్గీయులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా టీడీపీ మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, ముఖ్యనాయకులు సంజీవరెడ్డి శరత్, భానుకీర్తి తదితరులు పార్టీకి కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి



మృతి చెందిన చిరుత

పెద్దవడుగూరు: మండల పరిధిలోని భీమునిపల్లి కొండలో చిరుత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామానికి చెందిన కూలీలు బుధవారం ఉపాధి పనుల నిమిత్తం కొండ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ దుర్వాసన రావడంతో పరిసరాల్లో గాలించారు. చిరుత కళేబరం కనిపించింది. గుత్తిలోని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చిరుత కళేబరాన్ని పరిశీలించి..నమూనాలు సేకరించారు. మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన శ్రీవారి హుండీల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ రెండవ రోజు బుధవారమూ కొనసాగింది. రూ.36,74,845 నగదు, 94 గ్రాముల బంగారం, 1,700 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, కెనరా బ్యాంక్ మేనేజర్ మధుసూదన్, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి

పుట్టపర్తి టౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దామని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, దిశ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బాల్యవివాహాల నిరోధక చట్టం -2006పై మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పురోహితులు, ఇమాములు, చర్చి ఫాదర్స్‌కు బుదవారం కొత్తచెరువు ఆర్డీటీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లక్ష్మీకుమారి, డీఎస్పీ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. పేదిరికం, నిరక్ష్యరాస్యత కారణంగా చాలా మంది తమ కుమార్తెలకు మైనారిటీ తీరక ముందే పెళ్లి చేస్తున్నారని, చట్టరీత్యా ఇది నేరమని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారులు శివరంగప్రసాద్, సుబ్బారెడ్డి, మహేష్, నాగలక్ష్మి, మురళీధర్, రాజకుమార్, సుధాకర్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పండు ఈగ నివారణ చర్యలు చేపట్టండి



పండు ఈగ ఆశించడంతో దెబ్బతిన్న మామిడి పండు

అనంతపురం అగ్రికల్చర్: పండు ఈగ, మసి తెగులు ఆశించడంతో మామిడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులకు ఢోకా ఉండదని ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు తెలిపారు. మామిడి తోటలు చాలా వరకూ పిందె నుంచి కాయ పెరిగే దశలో ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో పండు ఈగ ఆశించిన కాయలు తొందరగా రాలిపోతాయన్నారు. పక్వానికి వచ్చిన కాయ కింది భాగంలో ఈగ పెట్టిన గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు కాయ లోపల కండ తిని దెబ్బ తీస్తాయన్నారు. ఆలస్యంగా కోతకు వచ్చే నీలం, తోతాపురి, నీలేషాన్ రకాల్లో పండు ఈగ సమస్య అధికంగా ఉంటుందన్నారు. నివారణలో భాగంగా ప్రతి 20 మామిడి చెట్లకు ఒక ఆకర్షణ పళ్లెం ఉంచాలని వివరించారు. అలాగే 200 మి.లీటర్ల నీటిలో 10 మి.లీ మిథైల్ యూజినాల్, 20 మి.లీ మలాథియాన్ మందులు కలిపి పళ్లెంలో వేలాడదీస్తే మగ ఈగలు ఆకర్షితమై అందులో పడి చనిపోతాయని పేర్కొన్నారు. అలాగే అక్కడక్కడ లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్రూట్ కవర్స్ ఏర్పాటు చేసుకున్నా పండు ఈగ నుంచి మామిడిని కాపాడుకోవచ్చునని తెలిపారు.

- శిలీంధ్రం ద్వారా వ్యాపించే మసి తెగులు, రసం పీల్చే తేనెమంచు పురుగులు, పిండినల్లి విసర్జించిన తియ్యని పదార్థం ఆకులు, పిందెల మీద పడటం వల్ల నల్లటి మసిలా పెరుగుతుంది. దీని వల్ల కిరణ జన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి కాయ సైజు తగ్గిపోవడం, రాలిపోవడం జరుగుతుంది. నివారణలో భాగంగా రసం పీల్చే పురుగులను ముందుగా అరికట్టాలి. 2 కిలోల గంజిపొడిని 3 లీటర్ల గోరువెచ్చని నీటిలో కలపడం ద్వారా 100 లీటర్ల గంజి ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. మసి తెగులు కనిపించే ప్రాంతాల్లో బాగా ఎండ ఉన్న సమయంలో ఈ గంజి ద్రావకాన్ని పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

హత్య కేసు నిందితుల అరెస్ట్

నార్పల: మండల కేంద్రంలో చోటు చేసుకున్న హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం నార్పల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖరరెడ్డితో కలసి డీఎస్పీ వెంకటశివారెడ్డి వెల్లడించారు. ఈ నెల 1న నార్పలలోని ఫర్టిలైజర్ దుకాణ యజమాని వీరభద్రను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో హతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో రఘుపతితో పాటు మరో బాల నేరస్తుడిని అరెస్ట్ చేశారు. వీరభద్ర, రఘుపతి ఇద్దరూ కలసి నార్పలలో ఎరువుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లుగా వ్యాపారం సజావుగా సాగింది. ఈ క్రమంలో ఆర్థిక లావాదేవీల విషయంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొని విడిపోయి, వేర్వేరుగా ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. పోటీలో భాగంగా తన వ్యాపారాన్ని దెబ్బ తీయడంతో పాటు సంసారంలో గొడవలు రావడానికి కూడా వీరభద్రనే ప్రధాన కారణంగా భావించిన రఘుపతి అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎలాగైనా వీరభద్రను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుని సోమవారం సాయంత్రం తన దుకాణంలో పని చేస్తున్న బాలుడితో కలసి వీరభద్ర దుకాణంలోకి చొరబడి వేటకొడవండ్లతో దారుణంగా నరికి హతమార్చారు. అనంతరం ఇద్దరూ ద్విచక్రవాహనంపై ఉడాయించారు. కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం నాయనపల్లి క్రాస్ వద్ద తచ్చాడుతున్న నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన రెండు వేటకొడవళ్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆకర్షణీయంగా రైల్ కోచ్ రెస్టారెంట్

- గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి
- రేపు ప్రారంభించనున్న డీఆర్ఎం



రైల్ కోచ్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు

గుంతకల్లు: ఇన్నాళ్లు పట్టాలపై ప్రయాణికులతో పరుగు తీసిన ఏసీ బోగీ.. నేడు విలాసవంతమైన రెస్టారెంట్‌గా గుంతకల్లు రైల్వే స్టేషన్ ఆవరణలో ఆకట్టుకుంటోంది. అదనపు ఆదాయంపై దృష్టి పెట్టిన రైల్వే అధికారులు రూపొందించిన కోచ్ రెస్టారెంట్‌ను శుక్రవారం డీఆర్ఎం వినీత్ సింగ్ ప్రారంభించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండవదిగా, రాష్ట్రంలో మూడోవదిగా ఈ కోచ్ రెస్టారెంట్ ఖ్యాతిగాంచనుండడం గమనార్హం. కాగా, ఈ రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చి మూడేళ్లవుతోంది. అయితే టెండర్లను ఐదు సార్లు నిర్వహించిన అధికారులు నిర్ణయించిన ధర ఎక్కువగా ఉండడంతో ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చివరకు గుంతకల్లుకు చెందిన ఓ కాంట్రాక్టరు రూ.26 లక్షలు చెల్లించి, నిర్వహణ హక్కులు దక్కించుకున్నాడు. ఈ ఏసీ కోచ్‌లో దాదాపు 40 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 80 మంది ఒకేసారి కూర్చోవచ్చు. 24 గంటలూ అల్పాహారం, భోజనాలు అందుబాటులో ఉంటాయి.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి

- పీఓ, ఏపీఓల శిక్షణలో జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వర్తించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక డీవీడీబీఎస్ చిన్మయ విద్యాలయలో హిందూపురం అర్బన్, మండల పీఓలు, ఏపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. నామినేషన్ల మొదలు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ ప్రతి ఒక్కరూ కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సెరికల్చర్ ఏడీ సురేష్ పాల్గొన్నారు. కాగా, గురువారం లేపాక్షి, చిలమత్తూరు మండలాల పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఉంటుంది.

పాఠశాల ఆవరణలో ఎగిసిపడిన మంటలు



పాఠశాల ఆవరణలో చెలరేగుతున్న మంటలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇటీవల కాంప్లెక్స్ భవన నిర్మాణం కోసం చెట్లను తొలగించి ఆవరణలోని ప్రహరీ వద్ద నిల్వ చేశారు. బుధవారం రాత్రి అటుగా వెళ్లిన ఆకతాయిలు నిప్పు రాజేయడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు సమాచారం అందించడంతో ధర్మవరం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేపట్టారు. మంటలు ఎగిసి పడి పాఠశాల ఆవరణలోని మిగిలిన చెట్లు, విద్యుత్ తీగలకు వ్యాపించడంతో ఒక్కసారిగా అక్కడ పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు రంగంలో దిగి అగ్నిమాపక సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు. గంటకు పైగా శ్రమించిన అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయి.

నీళ్ల బక్కెట్‌లో పడి బాలుడి మృతి



అఖిల్ మృతదేహం

పెద్దవడుగూరు: నీళ్ల బకెట్‌లో పడి ఓ బాలుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన శివకుమార్ యాదవ్, రాధ దంపతులకు ఓ కుమార్తె, ఏడాదిన్నర వయసున్న కుమారుడు అఖిల్ ఉన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు తల్లి ఇంట్లో పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న అఖిల్ ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో తలకిందులుగా పడ్డాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదాన్ని గుర్తించలేదు. కాసేపటి తర్వాత ఇంటి బయటకు వచ్చిన తల్లి బకెట్‌లో నుంచి పైకి బాలుడి కాళ్లు కనిపిస్తుండడంతో గట్టిగా కేకలు వేస్తూ వెలికి తీసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని వెంటనే పెద్దవడుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుడి సూచన మేరకు పామిడికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. మృతుడి చేతిపై మధు అని తెలుగులో రాసి ఉందన్నారు. శరీరంపై జంధ్యం ఉందని, ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.